ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025
5
శ్రీ సత్యసాయి

ప్రభుత్వ భూమిపై నివేదికలు ఇవ్వండి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రతి నియోజకవర్గంలోని 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి వివరాలు సేకరించాలని, నియోజకవర్గంలో పదివేల లోపు టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆయా డివిజన్ల అభివృద్ధిపై ఆర్డీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ అభివృద్ధిపై పరిశ్రమల స్థాపనకు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, గృహ నిర్మాణాలు, జాతీయ రహదారులు, భూ సేకరణ, ఇరిగేషన్, పర్యాటక రంగం అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి నియోజకవర్గంలో 30 వేల ప్రభుత్వ భూములు రహదారులకు అనుసంధానంగా ఉండే విధంగా సేకరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, లోక్‌అలాదత్ కేసులు పెండింగ్ లేకుండా ఆర్డీవోలు దృష్టి సారించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో పీఎం సూర్య ఘర్ పథకంపై 10 వేల రూపు టాప్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. వేసవిలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్, మహేష్, శర్మ, సూర్యనారాయణ రెడ్డి, నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, సిపిఒ విజయకుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

హిందూపురంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

నాటి వాగ్దానాలు గుర్తులేవా..?

◆ విద్యుత్ భారాలపై సిపిఎం ఆగ్రహం ◆ కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన

'తాము అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం... సెకీ ఒప్పందాలను రద్దు చేస్తాం.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగుల గొడతాం'... అంటూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సమయంలో కూటమి నేతలు చేసిన వాగ్దానాలు అధికారంలోకి రాగానే గుర్తుకురావడం లేదాని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాడు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద బైటాయించి ఆందోళన చేపట్టారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వార్త 6లో

మరోమారు ఎంపిపి ఎన్నిక వాయిదా

◆ బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన రామగిరి వైసిపి ఎంపిటిసిలు ◆ గైర్హాజరుతో గాండ్లపెంట వాయిదా

గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాలోని రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించే విధంగా రసవత్తరంగా మారాయి. బలమున్న తమ స్థానాలను నిలపుకోవాలని వైసిపి ప్రయత్నిస్తుండగా, అధికార బలాన్ని ఉపయోగించి ఏదో రకంగా తమ వైపు తిప్పుకునేందుకు అధికార టిడిపి ప్రయత్నాలు చేస్తోంది. ఇద్దరి మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ రెండు స్థానాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు ఈ రెండు స్థానాల్లో ఎన్నిక వాయిదా పడింది. మూడవసారి శుక్రవారం జరగాల్సి ఎన్నిక కూడా మరోసారి వాయిదా పడింది. ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో తదుపరి ఏమి జరుగుతుందో అన్న ఆసక్తి నెలకొంది.

రామగిరి ఓటింగ్‌కు వైసిపి బహిష్కరణ

రామగిరి ఎంపిపి ఎన్నికను తాము బహిష్కరిస్తున్నట్టు ఐదుగురు వైసిపి ఎంపిటిసిలు తెలుపుతూ ఒక వీడియోను విడుదల చేశారు. రామగిరి మండలం పరిధిలో తొమ్మిది ఎంపిటిసిలున్నారు. ఇందులో ఒక్క స్థానం మినహా అన్నింటినీ ఇది వరకు వైసిపి గెలిచింది. ఇందులో ఇప్పుడు కొంత మంది టిడిపిలో చేరారు. ఇంకా మెజార్టీ వైసిపి వైపే ఉంది. ఈ నేపథ్యంలో ఎంపిపి ఎన్నిక జరుగుతుండటంతో ఇదివరకు పార్టీలో చేరిన వారితోపాటు అదనంగా తీసుకుంటే ఎంపిపి స్థానాన్ని సాధించవచ్చునని టిడిపి భావిస్తోంది. ఏదో రకంగా తమ పట్టును నిలుపుకునేందుకు వైసిపి ప్రయత్నిస్తోంది ఈ నేపథ్యంలోనే ఇరువైపులా ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం నాడు పెనుకొండలో పెద్దఎత్తున ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇక లాభం లేదనుకుని ఎన్నికకే హాజరవకుండా బహిష్కరిస్తూ శుక్రవారం నాడు వైసిపి ఐదుగురు ఎంపిటిసిలు వీడియో విడుదల చేశారు. దీంతో ఎన్నిక జరగలేదు.

గాండ్లపెంటలోనూ వాయిదా

గాండ్లపెంట ఎన్నిక కూడా వాయిదాలపై వాయిదాలు పడుతూ వస్తోంది. శుక్రవారం జరగాల్సిన ఎన్నికకు కోరం లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికను వాయిదా వేశారు. ఇక్కడ కూడా అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య పట్టు కోసం పోరు నడుస్తోంది.

గృహ నిర్బంధంలో ఉన్న జెడ్పీ ఛైర్‌పర్సన్

జెడ్పీ ఛైర్‌పర్సన్ గృహనిర్బంధం

రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె క్యాంపు కార్యాలయంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎలాంటి అంవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గృహనిర్బంధంలో ఉన్న గిరజమ్మను వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి పంచాయితీ రాజ్ విభాగం అధ్యక్షులు వెన్నపూస రవీంద్రా రెడ్డిలు పరామర్శించారు.

ప్రకాష్‌రెడ్డి పద్ధతి మార్చుకో..

పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే.

'ప్రకాష్‌రెడ్డి నీ పద్ధతి.. మాట తీరు మార్చుకో... లేకుంటే నీవు కలుగులో దాకున్నా వదిలేది.. లేదు.' అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. మీ సభ్యులపై నమ్మకముంటే రామేశ్వరం వరకు ఎందుకు వెళ్లావని ప్రశ్నించారు. విప్ జారీ పేరుతో బిసి నాయకులను అక్కడి పంపి ఉద్దేశ్యపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. అంత ధైర్యముంటే నీ సోదరులను ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. పక్క డివిజన్‌లోకి తీసుకెళ్లి వైసిపి జిల్లా అధ్యక్షురాలితో కలసి నాటకాలు ఎందుకు ఆడుతున్నావని మండిపడ్డారు. ఒక రౌడీల బూతులు తిడుతూ అధికారులపైకే వెలుతావా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

పురం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా అశ్వర్థ నారాయణరెడ్డి

పార్టీ విధేయుడి వైపే బాలయ్య మొగ్గు

బాలయ్యతో మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ఎంపికైన అశ్వర్థ నారాయణరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడిగా గుర్తింపు పొందిన మణేసముద్రంకు చెందిన అశ్వర్థ నారాయణరెడ్డిని హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా హిందూపురం నియోజకవర్గానికి ఈ పోస్టు దక్కింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతూ సీనియర్ నాయకుడిగా, వివాద రహితుడిగా అశ్వర్థనారాయణ రెడ్డికి గుర్తింపు ఉంది. ఆసియాలోనే చింతపండు, రెండు మిర్చి లావాదేవీలకు పేరెన్నిక గన్న హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవి కోసం పలువురు కూటమి పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగించారు. పార్టీ విధేయుడుగా ఉన్న అశ్వర్థనారాయణరెడ్డి వైపే స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పలువురు తెలుగుదేశం పార్టీ శ్రేణులు అశ్వర్థ నారాయణ రెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశ్వర్థ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ, మంత్రి నారా లోకేష్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా హిందూపురం వ్యవసాయ మార్కెట్ పురోభివద్ధికి తన వంతు కషి చేస్తానని తెలిపారు. రైతులకు అండగా ఉండి మార్కెట్‌యార్డు తరపున వారికి అన్ని విధాలా సహాయక సహకరాలు అందిస్తానని తెలియజేశారు.

మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి : డిఎంహెచ్ఒ

దర్శినమల పిఎచ్‌సిలో తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మహిళలు మూడేళ్లకు ఓ సారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం సూచించారు. ఆమె శుక్రవారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులు రాకుండా మహిళలు ముందస్తు పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యవంతమైన జీవితంపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో సైతం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆర్‌డిటి సహకారంతో పిహెచ్‌సిలో గర్భకోశ వ్యాధులపై పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం ఆమె ల్యాబ్, టీకాల నిర్వహణ, వాటి నిల్వ, తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకాలు సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఆయుష్మాన్ భారత్ ఐడిలు చేయించాలని వైద్యాధికారికి సూచించారు. అంతకుముందు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. ఆర్‌డిటి ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి సుచిత్ర, డాక్టర్ శిల్పతో కలిసి సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం పిఏపి సీమియర్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియాసాల్మన్, డిఐఒ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగేంద్ర నాయక్, పిహెచ్‌సి వైద్యాధికారి గోవర్ధన్‌నాయుడు, సిహెచ్ఒ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహారాజ్, సూపర్వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, ఎంఎల్‌హెచ్‌పిలు, పిహెచ్‌సి సిబ్బంది, మహిళలు హాజరయ్యారు.

దర్శినమల పిహెచ్‌సి తనిఖీ

ధర్మవరం రూరల్ : మండలంలోని దర్శినమల పిహెచ్‌సి, రావులచెరువు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం సందర్శించి రికార్డులను పరిశీంచారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. వివిధ అంశాలపై ఆరా తీశారు. ఆమె వెంట డిఐఒ డాక్టర్.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్రనాయక్, వైద్యాధికారి డాక్టర్ దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లె రఘునాథరెడ్డి

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని మరవకుంటపల్లి గ్రామంలో శుక్రవారం టిడిపి కార్యకర్త రాజశేఖర్(27) క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి హుటాహుటిన ఆ గ్రామం వెళ్లి రాజశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి రాజశేఖర్ భార్య స్రవంతి, తల్లి రమణమ్మ, సోదరుడు ముత్యాలు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కొత్తచెరువుకు చెందిన టిడిపి కార్యకర్త భాగ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పల్లె వారి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాయుడు, అమ్మినేని లోకేష్ ఉన్నారు.

'పది' పరీక్షకు 229 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 229 మంది గైర్హాజరయ్యారని డీఈవో జి.కృష్ణప్ప తెలిపారు. మొత్తం 104 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 21,658 మందికి గానూ 21,429(98.94 శాతం)మంది హాజరు కాగా 229 మంది గైర్హాజరయ్యారన్నారు. ప్రయివేట్ విద్యార్థులు 429 మందికి గానూ 393 మంది(91.61శాతం) హాజరు కాగా 36 మంది గైర్హాజర య్యారన్నారు. ఓపెన్ స్కూల్ సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో 535 మందికి గానూ 428 మంది హాజరు కాగా 107 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు 144 సెక్షన్ ఆంక్షలు అమలు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్

ప్రజాశక్తి-చిలమత్తూరు

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ సూచించారు. చిలమత్తూరు మండల పరిధిలోని వడ్డిచెన్నంపల్లిలో బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసిల్దార్ జగన్నాథం, మండల పరిషత్ అభివద్ధి అధికారి రమణమూర్తి, ఏపీఎం సువర్ణ, ఏపీపీ ఇందాద్, ఎజీపీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని, దీన్ని దష్టిలో ఉంచుకుని ప్రజలు వాటిపై దష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే వివాహాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి శ్రీధర్‌ను మండల అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కష్ణమూర్తి, మురళి, రవిచంద్ర, ఈశ్వరప్ప, ఎస్ఐ మునీర్ అహ్మద్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్

పేదలకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు

ఇళ్ల పట్టాలు ఇచ్చి కోర్టు ఉత్తర్వులు అమలు చేయండి - రెవెన్యూ అధికారులకు కెవిపిఎస్ వినతి

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిని ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు, పేదలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలోని సిపిఎం ఆధ్వర్యంలో కొల్లకుంట సమీపంలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాలు కేటాయించాలని భూ స్వాధీన పోరాటం ద్వారా గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలాల్లో ఇంటి పట్టాలను మంజూరు చేయించాలని కోరుతూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను చేశారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించలేదు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ గత ఫిబ్రవరి నెలలో హైకోర్టును ఆశ్రయించారు. పరిశీలన చేసిన న్యాయస్థానం పేదలకు న్యాయం చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు పేదలు ఆందోళన చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి.శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అంబేద్కర్ నగర్, రహమత్ పురం, ఇందిరమ్మ కాలనీ, శాంతినగర్ తదితర ప్రాంతాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. హైకోర్టు ఉత్వర్వులను అధికారులు పాటించి ఆ స్థలంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం హైకోర్టు ఉత్తర్వుల కాపీతో పాటు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ వినతిని డిప్యూటీ తహసీల్దార్ మైనూద్దీన్‌కు అందజేశారు. హైకోర్టు సూచనల మేరకు నాలుగు నెలల్లో అందరికీ న్యాయం చేస్తామని డిప్యూటీ తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, సిపిఎం నాయకులు రాజప్ప, ఇళ్ల పోరాటా కమిటీ నాయకులు సరస్వతి, జ్యోతి, నాజియా, చంద్రమ్మ, రామంజి, గంగమ్మ, మూర్తి, హనుమంత రాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డిపిఒకు ఫిర్యాదు

డిపిఒకు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) సమతకు వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మాల ప్రకాష్ అనే వ్యక్తి బాలాజీనగర్‌లో మురుగునీటి సమస్యపై ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్య దర్శి రామాంజనేయులు సమస్యను పరిష్కరించకపోగా 'నీ అంతు చూస్తా'నని అతడిపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. మీడియా ప్రతినిధి పట్ల కూడా దురుసుగా ప్రవర్తించారన్నారు. గతంలో కూడా ద్వారకామయినగర్‌లో మురుగునీరు తొలగింపు విషయంలో ఇలాగే ప్రవర్తించి ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించారని వివరించారు. స్పందించిన డిపిఒ బాలాజీనగర్‌లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఆవాజ్ మండల నాయకులు మాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణ, మండల నాయకులు రవి, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు కల్లు కిష్టప్ప, కెవిపిఎస్ మండల నాయకులు గోవిందప్ప, బాలాజీ నగర్ కాలనీవాసులు ప్రకాష్, కిష్టప్ప పాల్గొన్నారు. దళిత ప్రకాష్‌ను అవమానంగా మాట్లాడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ, రామకృష్ణ, అన్నమయ్య తెలిపారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఛైర్మన్ రమేష్ కుమార్

క్రమశిక్షణతో విద్యాభ్యాసం

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించి ముందుకెళ్లాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. పట్టణ సమీపంలోని కొటిపి వద్ద ఉన్న లయోలా పాఠశాలలో శుక్రవారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్సిపల్ ఛైర్మన్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అవగతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. లయోలా విద్యాసంస్థలు క్రమశిక్షణకు పెట్టింది పేరుగా ఉంటున్నాయని కొనియాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందించారు. క్రీడలు, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొటిపి మాజీ సర్పంచి ఉమాశంకర్ రెడ్డి, ఐఒబి బ్యాంక్ మేనేజర్ శశాంక్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ గోవింద రెడ్డి, ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, చర్చి ఫాదర్ ఆంటోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ

కదిరి టౌన్ : రెండో విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అంగన్వాడీ వర్కర్లకు పోషణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కదిరి సిడిపిఒ రాధిక హాజరై మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, అలివేలమ్మ, మమత, తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడిపి ఆవిర్భావ దినోత్సవం : పల్లె

పుట్టపర్తి అర్బన్ : టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

మాటతప్పిన కూటమి ప్రభుత్వం

విద్యుత్ భారాలపై సిపిఎం ఆగ్రహం.. జిల్లా వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యుత్ ఛార్జీల పెంచకుండా తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ట్రూ అప్ పేరుతో భారాలు మోపడం దుర్మార్గం అని సిపిఎం నాయకులు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపు, సెకీఒప్పందాలు, స్మార్ట్‌మీటర్ల రద్దు కోరుతూ పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్. వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదినెలల కాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి మరోసారి సర్దుబాటు చార్జీల భారం మోపడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అదానీ కంపెనీ ప్రయోజనాల కోసం సెకీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేసేందుకు ప్రజలపై ఎడాపెడా భారాలు మోపడం సరికాదన్నారు. సెకీ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించిన కూటమి నాయకులకు ఇప్పుడు అవి గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. హిందూపురంలో 42 సంవత్సరాలుగా నడుస్తున్న ఫ్రీకాట్ బి మిల్లు పెరిగిన విద్యుత్ చార్జీల కారణంగా మూత బడిందంటే ఆ భారం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఒకవైపు సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలు, మరోవైపు స్మార్ట్ మీటర్ల అదనపు భారం ప్రజలపై మోపడం అత్యంత దుర్మార్గమన్నారు. తక్షణం ఈ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న సెకీ ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ భారాలను తగ్గించకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్ల అంజి, గంగాధర్, జిల్లా కోశాధికారి వెంకటేష్, సిద్దు పాల్గొన్నారు.

పెనుకొండ : విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు, స్మార్ట్ మీటర్ల ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం నాయ కులు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని రెవెన్యూ అధికారు లకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ. 15,485 కోట్ల భారం మోపి ఇందుకు గత వైసిపి ప్రభు త్వమే కారణమని సాకులు చెబుతోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్దుబాటు ఛార్జీల ను వ్యతిరేకించిన టిడిపి, జనసేనపార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని అమలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, బాబావలి, తిప్పన్న, మహబూబ్‌బాషా, నాగరాజు, నరసింహ, ఆరిఫ్, రాజురావు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబ్‌జాన్, రామ్మోహన్, ముస్తాక్, సుధాకర్‌రెడ్డి, నారాయణ, గంగప్ప, ఆంజనేయులు, ఉదయ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లు, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, నరసింహ, గోవిందప్ప పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఎడికి వినతిపత్రం ఇచ్చారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం నాయకులు మారుతి, ఎస్‌హెచ్.బాషా, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీలు ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమన్నారు. కార్మికులు, ప్రజలు, రైతులకు నష్టం కలిగించే విద్యుత్ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదరవలి, వి.వెంకటస్వామి, గుంపు హరి, ఎ.ఖాదర్‌బాషా, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ చేపట్టిన సిపిఎం నాయకులు

పుట్టపర్తిలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ముదిగుబ్బ : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీకి అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి, వినాశకరమైన సెకి ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జిఎల్.నరసింహులు, మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, మునాఫ్, బాబు, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్‌జాన్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : విద్యుత్ భారాలపై సిపిఎం నాయకుడు గోవింద్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : అదనపు ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట పెంచిన విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి.శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్లో మండుటెండను సైతం లెక్కచేయకుండా మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు పట్టణ కన్వీనర్ రాములు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, సిపిఎం నాయకులు రాజప్ప, ప్రీ కార్డ్ బి యూనియన్ నాయకులు నందీశ్వర, శివకుమార్, లక్ష్మయ్య, ఆనందు, గోపాల్, బైలప్ప, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రామంజి, నరసింహులు, రాయుడు, మూర్తి, మహిళలు నాజియా, సరస్వతి, చంద్రమ్మ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తనకల్లు

గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన టిడిపి కార్యకర్త దేరంగుల కృష్ణ(55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. స్థానిక ఇందిరా నగర్‌కు చెందిన దేరంగుల కృష్ణ బి.ఏ.బీఈడీ చదివాడు. కొంత కాలం పార్ట్ టైం టీచర్‌గా పనిచేస్తూ, ట్యూషన్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత రెండేళ్లుగా అన్నమయ్య జిల్లాలోని అంగళ్లులో బస్టాండ్ కూడలిలో చిన్న టీ కేఫ్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కేఫ్‌లో గత శనివారం గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడు టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ సానుభూతి పరునిగా ఉన్నాడు. అతడికి భార్య ఖాదర్‌బి, కూతురు కాత్యాయని, కొడుకు వైష్ణవ్ ఉన్నారు.

మందుగుండు తిని ఆవుకి గాయాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని వీరజిన్నయ్యపల్లి గ్రామంలో శుక్రవారం మందు గుండు తినడంతో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు చెన్నప్ప తెలిపిన వివరాలు.. ఉదయం ఆవును వేయడానికి సమీపంలోని అమకొండపాలెం అడవికి తరలించామన్నారు. అక్కడ అడవి పందుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు మందు గుండ్లు వేయడంతో ఆవు వాటిని తినడంతో నోరంతా పగిలిపోయిందన్నారు. ఆవు పరిస్థితి విషమంగా ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగి పశువులు మృతిచెందినట్టు వాపోయాడు. కావు అటవీ శాఖ అధికారులు స్పందించి అడవి పందుల కోసం మందు గుండ్లు వేసే వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఆవుకు జరిగిన ప్రమాదంతో రూ. 50 వేలు నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని ఆ రైతు కోరాడు.

రైలు కిందపడి యువకుడు మృతి

సోమందేపల్లి : మండలంలోని చాకర్లపల్లి సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై శుక్రవారం స్థానికులు ముక్కలు ముక్కలుగా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే రైల్వే పోలీసులు చాకర్లపల్లి సమీపంలోని పంప్ హౌస్ వద్ద రైల్వే పట్టాలపై మృతదేహాన్ని పరిశీలించారు. 20 ఏళ్ల యువకుడు రైలు కింద పడ్డాడని, మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైందని తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రస్థాయి విజిలెన్స్ కమిటీలు, వినియోగదారుల రక్షణ కమిటీలు త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సరైన సేవలు అందాలంటే రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలతో పాటు రక్షణ కమిటీ లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాల్లో వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ధరల నియంత్రణ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేష్‌కుమార్

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎపి మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు జూటూరు మహేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని ఎలుకుంట్ల గ్రామస్తులు తహశీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎలుకుంట్ల గ్రామంలో మాల సామాజిక వర్గం ప్రజలకు సంబంధించిన శ్మశానవాటిక స్థలాన్ని అదే గ్రామానికి చెందిన అమరానారాయణ, రామానాయుడు ఆక్రమించుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. స్పందించిన తహశీల్దార్ ఉగాది పండుగ తరువాత గ్రామంలో పర్యటించి శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి, కంచె ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిర్రు ప్రకాష్, పుష్పరాజ్, కుళ్లాయప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ నటరాజ్‌కి వినతి ఇస్తున్న ఎలుకుంట్ల గ్రామస్థులు

పండుగల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు

ధర్మవరం రూరల్ : ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నట్లు ఒకటో పట్టణ సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయా పండుగల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున పట్టణానికి వస్తారని, దీంతో శని, ఆదివారాల్లో స్థానిక పాండురంగస్వామి సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకూ బైక్‌లు, ఇతర పెద్ద వాహనాలను అనుమతించమని తెలిపారు. అలాగే కళా జ్యోతి సర్కిల్ నుంచి పిఆర్‌టి సర్కిల్ వరకూ రోడ్డుకు ఇరువైపులా వేయబడిన లైన్ దాటి మోటార్ సైకిళ్లు రోడ్డుమీదకి వస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు తనిఖీ చేశారు. పనులను సకాలంలో నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట డాక్టర్ నజీర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ దేవేంద్ర నాయక్ సూచించారు. మండలంలోని వంకమద్ది, పెడబల్లి గ్రామాల్లో శుక్రవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా రికార్డులను ఆధునీకరిస్తూ ప్రతి భూ యజమానికి పక్కాగా న్యాయం చేయడం కోసం రీ సర్వే చేస్తున్నామన్నారు. ఖచితమైన కొలతలు, స్పష్టమైన విస్తీర్ణంతో నూతన భూరికార్డులు తయారవుతాయన్నారు. రీసర్వే సమయంలో రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జిలాని, ఆర్‌ఐ శ్రీధర్, విఆర్వోలు రఘు, అనూష, దీపిక, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు : నల్లచెరువులో శ్రీసీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి ఇదే గ్రామానికి భీమ్‌శెట్టి బాలయ్య (వెంకటరమణప్పశెట్టి) కుమారుడు భీమ్‌శెట్టి ఈశ్వరయ్య శుక్రవారం రూ. 50వేలు అందజేశారు. భీమ్‌శెట్టి ఈశ్వరయ్య ప్రస్తుతం కంబదూరు తహశీల్దార్‌గా పని చేస్తున్నారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, నగేష్, వేమయ్య, కెసి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

3న కూరగాయల మార్కెట్ వేలం

గోరంట్ల : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కూరగాయల మార్కెట్, స్టాండ్ ఫీజు, జెఆర్‌వై రూములకు ఏప్రిల్ 3వ తేదీ స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ జరగాల్సిన వేలం పాటను అనివార్య కారణాల వల్ల ఏప్రిల్ 3తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

'నవోదయ'కు వినేష్‌శౌర్య ఎంపిక

ముదిగుబ్బ : స్థానిక విజేత కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన వినేష్‌శౌర్య నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచి లేపాక్షి నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు జె.నాగభూషణం, డి.నాగరాజు, జె.సాంబశివ తెలిపారు. బాలఓబులేసు కుమారుడైన వినేష్‌శౌర్య స్థానిక పివిఎస్ స్కూల్‌లో చదివాడు. దీంతో వినేష్‌ను కరస్పాండెంట్ నాయుడు, సెంటర్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

ముదిగుబ్బ : డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రయాణికులు, తోపుడుబండ్ల వ్యాపారులు, ప్రజలు దాహార్తి తీర్చేందుకే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

కొత్తచెరువు : స్థానిక పుట్టపర్తి రహదారిలో నల్లగొండ కింద ప్రాంతంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయడానికి శుక్రవారం తహశీల్దార్ నీలకంఠారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. శ్మశానవాటిక నిర్మాణానికి త్వరలోనే స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు నజీర్, సర్వేయర్ సురేష్, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి మంత్రి పరామర్శ

పరిగి : మాజీ జడ్పిటిసి సూర్యనారాయణను శుక్రవారం మంత్రి సవిత ఫోన్‌లో పరామర్శించారు. సూర్యనారాయణ ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో విజయవాడలో ఉన్న మంత్రి ఆయనకు ఫోన్ చేసి పరిమర్శించారు. ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అసంక్రమిత వ్యాధులు, వడదెబ్బ, డ్రైడే ఫ్రైడేపై అవగాహన కలిగి ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు సూచించారు. వారు శుక్రవారం పట్టణంలోని వివేకనంద రోడ్డులోని ఓ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనత, అసంక్రమిత వ్యాధులు, వడదెబ్బ, తదితర వ్యాధులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, యోగ, నడక అవసరమ న్నారు. వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు వారంలో ఓ సారి డ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆరోగ్య కార్యకర్త మంజుల, ఆశా కార్యకర్త ఉమ, పాల్గొన్నారు.

ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రంజాన్ కానుక పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రంజాన్ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎల్‌సికె పురం ప్రాంతంలో మహమ్మద్ ఇగ్బాల్, దిల్షాద్ ఆధ్వర్యంలో 300 ముస్లిం మైనార్టీ నిరుపేదల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యర్రగుంట షేక్షావలి మాట్లాడుతూ మహమ్మద్ ఇగ్బాల్, దిల్షాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా రంజాన్ కానుక పంపిణీ చేయడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. యర్రగుంటలోని ఉస్మానియా మసీదులో సుమారు వెయ్యి మందికి అన్నదానం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ ఇగ్బాల్, దిల్షాద్ కొడుకులు యర్రగుంట షేక్షావలి, షాషావలి, జిలాన్‌బాషా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న దాతలు

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ వేడుకలు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఉద్యోగ విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు హాజరై ఉద్యోగాలకు ఎంపికైన 109 మందికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాఖాధిపతులు హేమాంజ, బాలజోషి, కల్యాణి, ప్లేస్‌మెంట్ అధికారి జసింత్ పాల్గొన్నారు.

గొట్లూరు వృద్ధాశ్రమంలో అన్నదానం

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు గ్రామంలో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం పట్టణానికి చెందిన బాలాజీ కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. దాత బాలాజీ మాట్లాడుతూ పెనుబోలు గ్రామానికి చెందిన తమ తండ్రి బాలగొండ శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వారి మిత్రులు ప్రతాప్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, జయ, అభి పాల్గొన్నారు.

యువత ప్రలోభాలకు లోనుకావద్దు

బుక్కపట్నం : యువత ప్రలోభాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని తహశీల్దార్ షాబుద్దీన్ సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ యువత ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు గ్లాసుల పద్ధతి విడనాడాలని, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రలోభాలకు లోను కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. నవోదయ 2.0, సైబర్ నేరాలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, వీఆర్వో సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్లిలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి జామియా మసీదులో శుక్రవారం తెలుగు యువత నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందులో మంత్రి భర్త వెంకటే శ్వర్లు, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఇఫ్తార్ విందులో భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచి బాలాజీ, కాంట్రాక్టర్ మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అరుణ, ఎంపిపి ఆదిశేషారెడ్డి, మారుతిప్రసాద్, తిలక్, నాగభూషణ్‌గౌడ్, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెంకటేశ్వర్లు, నాయకులు

ఎన్‌పి.శివానందయ్యకు డాక్టరేట్

ప్రజాశక్తి-పావగడ

డాక్టర్ ఎన్‌పి.శివానందయ్య సేవలను పరిగణలోకి తీసుకుని ముంబైలోని ప్రతిష్ఠాత్మక సంస్థ డా. ఎస్.రాధాకృష్ణ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సిఫార్సు మేరకు అమెరికాలోని ప్రతిష్టాత్మక సెంట్రల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ ప్రొ. ఎన్‌పి. శివానం దయ్య ప్రభుత్వ మహిళా ప్రథమ శ్రేణి కళాశాలలో రాజనీతిశాస్త్ర ఆచార్యులుగా, ప్రిన్సిపల్‌గా సుదీర్ఘ సేవలు అందిస్తున్నారు. దీంతో శుక్రవారం ఆయనను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థి నులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుబ్బి తాలూకా సిఎస్.పుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పుట్టరాజు, ప్రొఫెసర్ సంజీవ్‌మూర్తి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.మారెప్ప, రామాంజనమ్మ, నాగరాజు, హెచ్. నాగేంద్రప్ప, రాజన్న, అనంతరాజు, మమత, మీనా, సుమాదేవి, మధుకుమార్, కిరణ్, అరుణ్‌కుమార్, ప్రకాష్, నాగభూషణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్ని బన్నిరాయలు జయంతి

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని తాలూకా కార్యాలయంలో శుక్రవారం అగ్ని బన్నిరాయలు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా బన్నిరాయలు చిత్రపటానికి వీఎ రాజేష్ పూలమాల వేసి నివాళు లర్పిం చారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అగ్నిబన్నిరాయలు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఈరన్న, గురునాల్, హర్షిత, కావ్య, ముల్లా ఇమామ్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 24వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రబాబు శుక్రవారం తన వార్డులో విధులు నిర్వహిస్తున్న పాదశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డిల సూచనల మేరకు తన వంతుగా పారిశుధ్య కార్మికులకు సహాయం అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగేంద్ర ప్రసాద్, నాగరాజు, రవి, గంగ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

పాస్టర్ ప్రవీణ్ కుమార్ మతిపై అనుమానాలను నివృత్తి చేసేలా ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ది యూనైటెడ్ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే ఈయనది హత్యగా అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ కేసులో పోలీసులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవాలు వెలుగులోకి తేవాలన్నారు. విలేకరుల సమావేశంలో సూర్య ప్రకాష్, పాల్ తీమోతీ, దేవారాజు, జాన్సన్ ప్రకాష్, జగదీష్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఇజ్రయిల్ రాజు పాలొన్నారు.

గంగాధర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రంజాన్ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గణేష్ కూడలిలో ఉన్న ఓ షాదీ మహల్ హాలులో తోట్ల గంగాధర్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరుభావంతో మెలగాలన్నారు. పట్టణంలోని ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస దీక్ష విరమించారన్నారు. ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన తోట్ల గంగాధర్‌కు ముస్లింల తరపున ధన్యవాదాలు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ముస్లింలకు వడ్డిస్తున్న గంగాధర్

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రాథమిక హక్కులు, విధులు, చట్టాల గురించి ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని తహశీల్దార్ నీలకంఠారెడ్డి సూచించారు. మండలంలోని బైరాపురం ఎస్సీ కాలనీ ఆర్‌డిటి పాఠశాలలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీలను దూషించినా, దాడులు చేసినా ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, డివిఎంసి మెంబర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని కుర్లపల్లి గ్రామంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని పౌరులకు సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పౌరుల హక్కులకు భంగం కలిగితే వారికి రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ కల్పిస్తామన్నారు. గ్రామంలో అందరూ కలిసి మెలసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ షర్ఫుద్దీన్, ఎంఇఒ-2 కుళ్లాయప్ప, విఆర్ఒలు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక జీవనజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ రామానాయక్ ఆధ్వర్యంలో ఎంపిపి మహమ్మద్ రఫీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరైనా ప్రజల సమస్యలపై చర్చించకుండా తూతూమంత్రంగా నిర్వహించారు. ఒకరి స్థానంలో మరొకరు సమావేశానికి హాజరైనా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు మూడేళ్లుగా హాజరుకావడం లేదని, సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు సభ్యులే పేర్కొనడం గమనార్హం. సమావేశంలో ప్రభుత్వ వైద్యాధికారి అల్తాఫ్, ఎంఇఒ వెంకట్రాముడు, అగ్రికల్చర్ ఏవో షాదాబ్, విద్యుత్ శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యు జేఈ జయమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ దీప, ఇరిగేషన్ అధికారి, వెలుగు ఎపిఎం బాబ్జి, ఉపాధి ఎపిఒ, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని సుమారు 20 మసీదుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం ఐక్యవేదిక, అఖిల భారత టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఉమర్ ఫరూక్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఆమోదం కోసం చట్టం చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం ముస్లిం అభివద్ధి ఆటంకం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయటానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్షులు షేక్ షబ్బీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, బిలాల్, అమీన్, అబ్దుల్‌సలాం, చిటిక్, ముజీబ్ పాల్గొన్నారు.

హిందూపురంలో చేతికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం మైనార్టీలు